ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు

5

శుక్రవారం 3 మే 2024

టీ-ఫైబర్.. నో సిగ్నల్

● అసంపూర్తిగా పనులు ● పల్లెలకు అందుబాటులోకి రాని ఇంటర్నెట్ ● గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు



నెన్నెల జీపీలో ఏర్పాటు చేసిన బీపీ సెటప్ సిస్టం

నెన్నెల, మే 2: ఇంటింటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన టీ-ఫైబర్ ప్రాజెక్టు పురోగతి ప్రశ్నార్థంగా మారింది. సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతోపాటు ప్రతీ ఇంటికీ ఆన్‌లైన్ సేవలు అందించాలనే లక్ష్యం నెరవేరలేదు. 2015 లో ప్రారంభమైన ఈ మెగా ప్రాజెక్టు 2022నాటికే పూర్తి కావాల్సి ఉంది. నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పల్లెల్లో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం లేదు.

నత్తనడకన పనులు

గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీఎస్, విద్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు ఒక జీబీపీఎస్ కనీస వేగం కలిగిన బ్రాడ్‌బ్యాండ్ సేవలను తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్ నెట్‌లో భాగంగా జిల్లాలో స్టెర్‌లైట్ సంస్థ పనులను చేపట్టింది. జిల్లాలోని 18 మండలాల్లోని 311 గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు వందల కిలోమీటర్ల మేర గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లతోపాటు అండర్‌గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టిక్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణం పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలకు అనుసందానం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తలెత్త కుండా ఉండేందుకు సోలార్ ఇన్వర్టర్లు కూడా ఏర్పాటు చేశారు. కాని కనెక్షన్ ఇచ్చేందుకు టెక్నికల్ పనులు మిగిలి ఉన్నాయి. పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నా ఇంటింటికి దేవుడెరుగు గ్రామ పంచాయతీ కార్యాలయాలకే నెట్ కనెక్షన్ ఇవ్వడం లేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి పూర్తి చేసిన పనులు వృథాగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

క్లస్టర్ వ్యవస్థకు మంగళం

గ్రామాలకు ఇంటర్ నెట్ సౌకర్యం లేక క్లస్టర్ల విధానం కనుమరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల వివరాలు, ఆదాయ వ్యయాల సమాచారాన్ని పంచాయతీల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ప్రభుత్వం క్లస్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. అయిదు నుంచి ఏడు గ్రామాలను కలిపి క్లస్టర్లుగా విభజించారు. వాటికి అవసరమైన కంప్యూటర్లు ఇతర సామగ్రి, కంప్యూటర్ ఆపరేటర్ల ను నియమించారు. వారికి ఆన్‌లైన్ విధానం, ఈ-పాలనపై శిక్షణ ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత గ్రామాల్లో బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం లేదనే సాకుతో ఈ విధానానికి మంగళం పాడారు. అందరికీ పంచాయతీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలనే సదుద్దేశంతో ప్రవేశ పెట్టిన క్లస్టర్ల వ్యవస్థ నిర్వీర్యం కావడంతో గ్రామాల ప్రజలకు పంచాయతీ పాలన విధానం దూరమైంది. ఆయా గ్రామ పంచాయతీల కా ర్యదర్శులు పంచాయతీల వివరాలను పొందుపర్చడానికి మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజలకు ఏదైన అవసరం ఏర్పడితే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఇప్పటికీ మాన్యువల్ పద్ధతిలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైన సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితి ఉంది. ఇంటిపన్నులు, వివిధ అనుమతి పత్రాలు, లైసెన్సు, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన

మాన్యువల్‌గానే పనులు

చెక్కులు, జీతాల రసీదు పనులు మాన్యువల్ పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. నెలనెల పంచాయతీల ఆదాయ, వ్యయాలను ఆన్‌లైన్ ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఈ పనులన్నింటికి ఇంటర్‌నెట్ సిగ్నల్ అడ్డంకిగా మారింది.

ప్రారంభమైతే సేవలు

గ్రామాల్లో సైతం ప్రస్తుతం ఇంటర్‌నెట్ వినియోగం పెరిగింది. ప్రైవేటు కంపెనీలు పెద్ద గ్రామాల్లో టవర్లు ఏర్పాటు చేస్తున్నప్పటికి ఇంటర్నెట్ సౌకర్యం లేని పల్లెలు ఇప్పటికి చాలా ఉన్నాయి. గిరిజన గ్రామాలు, అటవీ ప్రాంతాల్లోని పల్లెల్లో మొబైల్ సిగ్నల్ అందక ఇక్కట్లకు గురవుతున్నారు. రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది సిగ్నల్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ-బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి-మెడిసిన్, వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ-క్లాస్ లాంటి సేవలు టీ-ఫైబర్ ప్రారంభమైతే గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

పనులు పూర్తి చేయాలి : గాజు మహేందర్, మన్నెగూడం



ప్రతీ విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉంది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తే గ్రామ పంచాయతీల్లో ఈ-సేవలు అందుబాటులోకి తేవాలి.



గ్రామంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ లైన్ పనులు

అంతా డిజిటల్ ప్రచారం

● ప్రచారంలో కొత్త పుంతలు.. ● గోడలపై రాతలు మాయం..
● సామాజిక మాద్యమాల్లో విస్తృత ప్రచారం

దండేపల్లి,మే 2: లోక్‌సభ ఎన్నికలల్లో ఓటర్ల నాడి తెలుసుకునేందుకు పార్టీలు వేర్వేరు మార్గాలు అనుసరిస్తున్నాయి. సర్వే సంస్థలు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ఓటర్ల మనసులో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారం కొత్తపుంతలు తొక్కుతోంది. గతంలో గోడలపై రాతలు కనిపించేవి. ఫలానా పార్టీ అభ్యర్థి జిందాబాద్, నాయకత్వం వర్దిల్లాలి అంటూ ఆకట్టుకునే నినాదాలతో గల్లి గల్లీలోనూ ఇంటి ప్రహరీలపై రాసేవారు. గడపగడపకు వెళ్లి కరపత్రాలు అందించేవారు. నేడు ఆ పరిస్థితులు మారాయి. చేతిరాతలు కనుమరుగయ్యాయి. మైకుల స్థానంలో మొబైల్ ఫోన్ సందేశాలు క్షణాల్లో ఓటర్లకు చేరుతున్నాయి. ప్రచార పర్వం అంతా సామాజిక మాధ్యమాల్లో విహరిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ప్రతి పార్టీ అభ్యర్థి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకొని సామాజిక మాధ్యమాన్ని నడిపిస్తున్నారు. వీరంతా అన్ని గ్రామాల్లో బృందాలు ఏర్పాటు చేసుకొని క్షణాల్లో వార్తలను తమ నేతలకు అనుగుణంగా తయారు చేసి వ్యాప్తి చేస్తున్నారు.

ప్రచార సాధనాలుగా సెల్‌ఫోన్

రాజకీయ పార్టీలు అందమైన చిత్రాలతో ఫ్లెక్సీలు ముద్రించి పోటాపోటీగా వీటిని ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం మొబైల్‌ను ప్రచార సాధనాలుగా తయారు చేసుకున్నారు. మారుతున్న సాంకేతికతను వినియోగించుకుంటూ ఇంటర్నెట్ సేవలతో వాట్సప్, పేస్‌బుక్ తదితర ప్రచార మాధ్యమాలను వేదికలుగా చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. రికార్డు చేసిన మాటలు, హామీలు మొబైల్ పోన్లలో వినిపిస్తున్నాయి. గత ఎన్నికల నుంచి ప్రచారంలో త్రీడి సాంకేతికతను వినియోగించుకొని తెరపై అగ్రనేత మాట్లాడే దృశ్యాలను చూపిస్తున్నారు.

ప్రస్తుత ఎన్నికల నుంచి ఓటర్లలో చైతన్యం కనిపిస్తోంది. అభ్యర్థులకు కొన్ని చిత్ర, విచిత్ర సంఘటనలు ఎదురవుతున్నాయి. అభ్యర్థులు గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయన్న నిలదీత లు సామాజిక మాధ్యమాల్లో పెరుగుతున్నాయి. వీటి ద్వారా క్షణాల్లో ఆయా పార్టీల నాయకులను నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులకు సమస్యలను నేరుగా చూపించి పరిష్కారం అడుగుతున్నారు. ఈ సారి గెలిపించండి తప్పక పని పూర్తి చేయిస్తానని అభ్యర్థులు కూడా హామీలిచ్చి బయటపడుతున్నారు.

ఫొటోలు, వీడియోలతో...

నెల రోజుల వ్యవధిలో అభ్యర్థులు ఓటర్లందరిని కలిసి ఓట్లు అడగడం అసాధ్యం. అందుకే సామాజిక మాధ్యమాల ద్వారా నియోజకవర్గంలోని ఓటర్లకు దగ్గరయ్యేందుకు అభ్యర్థులు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు మండలం, గ్రామానికో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నాయి. అభ్యర్థులు కూడా సోషల్ మీడియా బృందాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా బృందాలు ప్రచార చిత్రాలు, లఘు వీడియోలు రూపొందించి ఎప్పటికప్పుడు ఆయా గ్రూపులు, మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వాయిస్ రికార్డింగ్ కాల్స్‌తోను ఓటర్లను పలకరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి రాజు చౌహాన్

చెన్నూరు, మే 2: నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సీజీఎం (ప్రాజెక్టు) రాజు చౌహాన్ కోరారు. గురువారం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యుత్ సరఫ రాలో లోఓల్టేజీ సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు స్థానికంగా ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏడీఈ రవికు మార్, ఏఈ శ్రీనివాస్, సీనియర్, జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

మందమర్రిరూరల్: నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలని సీజీఎం (ప్రాజెక్టు) రాజు చౌహాన్ పేర్కొన్నారు. మండలంలోని పలు సబ్‌స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయాలన్నారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏడీఈలు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, ఏఈ జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌డిపో జేఏసీ కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, మే 2: మంచిర్యాల బస్‌డిపోలోని అన్ని యూనియన్ల కార్మికుల సమక్షంలో గురువారం జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ కన్వీనర్‌గా భీమేశ్వర్‌రావు, చైర్మన్‌గా తోట సత్తయ్య, కోశాధికారిగా నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడిపల్లి శ్రీనివాస్, కన్వీనర్లుగా గోలి శంకర్, రావు, దుర్గయ్య, రాజేశ్వర్, అనూష, రమేష్, బాపన్నలను ఎన్నుకున్నారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

దండేపల్లి,మే 2: ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఎస్‌ఐ భూమేష్ సూచించారు. గురువారం గూడెం పోలీసు చెక్ పోస్ట్ వద్ద కేంద్ర బలగాలైన సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలతో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తీసుకపోతే ఆధారాలు వెంట ఉండాలన్నారు. ఆధారాలు లేకుంటే డబ్బులను సీజ్ చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలందరు పోలీసుకుల సహకరించాలన్నారు. ఓటు హక్కు కలిగిన ఉన్న ప్రతీ ఒకరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఎస్‌టీ టిమ్ ఇన్‌చార్జి విజయప్రసాద్, ఏఎస్సై పసర్తి రాజేందర్ సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ నరసింహులు

కన్నెపల్లి, మే 2: మండలంలోని టేకులపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం జాయింట్ కమిషనర్ నరసింహులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు పెద్ద సంఖ్యలో పనులు కల్పించాలని సూచించారు. పని చేసే ప్రదేశాల్లో కూలీలకు నీడ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రలు తీసుకోవాలని, ఉదయం పూట పనులు ముగించుకోవాలన్నారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. ఎస్‌పీఎం మురళీ, డీఆర్‌డీఓ కిషన్, అడిషనల్ డీఆర్‌డీవో దత్తరావు, ఎంపీడీవో గంగామోహన్, ఏపీవో శ్రీనివాస్, టీఏ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

భీమారం, మే 2 : భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడ్లకొండ పవన్ ఏప్రిల్ 1న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా గురువారం పోలీస్‌స్టేషన్‌లో భీమారం ఎస్‌ఐ రాములు అందజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పవన్ తన ఫోన్ పోయిన విషయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఈఐఆర్ ఆపరేటర్ పున్నం, హెడ్‌కానిస్టేబుల్ మాచర్ల పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మధ్య అంతర్గత ఒప్పందం

● రేపు కేసీఆర్ రోడ్ షో ● విలేకరుల సమావేశంలో బాల్క సుమన్

మంచిర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4న జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. సాయంత్రం 5 గంటలకు ఐబీ చౌరస్తాలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా రోడ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్ షోలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు, కార్మికులు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ తప్ప వేరే పార్టీలు లేకుండా చేయాలని రెండు పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందంతోనే పార్లమెంటు ఎన్నికల్లో పరస్పర అవగాహనతో అభ్యర్థులను ప్రకటించాయన్నారు. పెద్దపల్లి, కరీంనగర్‌లో బీజేపీ బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టారన్నారు. కాంగ్రెస్, బీజేపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

అరాచకాలు, అమలుగాని హామీలపై కేసీఆర్ బస్సు యాత్రలో ప్రశ్నిస్తుంటే ఆయా పార్టీలు బెంబేలెత్తుతున్నాయన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర ఆయా పార్టీలకు వెన్నులో వణుకుపుట్టిస్తోందని, అందుకే దేశంలో ఏ నాయకుడిపై లేని విధంగా 48 గంటలు నిషేధం విధించారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను రేవంత్ సర్కారు తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ ఇచ్చిన హామీలను మరిచిపోయిందని, రెండు లక్షల ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల ధరల పెంపు, పేదరికం, ఆర్థిక అసమానతలకు కారణమైన బీజేపీ ప్రజలు ఓటు వేయవద్దని కోరారు. సింగరేణి కార్మికునిగా 26 సంవత్సరాలు పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే పార్లమెంటు నియోజకవర్గంలో వినోద్, వివేక్ ఎమ్మెల్యేలుగా, వివేక్ కొడుకు ఎంపీగా టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఏర్పడ్డాక కరెంటు కోతలు పెరిగాయని, తాగునీరు దొరకని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బీఆర్ఎస్ మాత్రమే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని ప్రజలు నమ్ముతున్నారని, ఆ రెండు పార్టీలకు ఓట్లు వేయమని వారే చెబుతున్నారన్నారు. కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. గాదె సత్యం, సందెల వెంకటేశ్, ఎర్రం తిరుపతి, అంకం నరేష్, సీపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు

జిల్లాలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



మంచిర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 46.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని జన్నారం మండలంలో గరిష్టంగా 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా నస్పూర్ మండలంలో 46.0 డిగ్రీలు, హాజీపూర్ మండలంలో 45.8, భీమారం 45.6, దండేపల్లి 45.5, చెన్నూరు 45.2, మంచిర్యాల, వేమనపల్లి, జైపూర్ మండలాల్లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. వాతావరణ శాఖ జిల్లాలో రెడ్‌అలర్ట్ ప్రకటిం చింది. నెన్నెల మండలంలో 44.9 డిగ్రీలు, కోటపల్లి మం డలంలో 44.5 డిగ్రీలు, లక్షెట్టిపేట మండలంలో 44.4 డిగ్రీలు, మం దమర్రి, బెల్లంపల్లి మండలాల్లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా మండలాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి.

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 2: డీఈవో, ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. అనంతరం పట్టణ కార్యదర్శి రేగల సిద్దార్థ, కౌన్సిల్ సభ్యుడు గణేష్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై ఫిర్యాదు చేసినా కనీసం స్పందించడం లేదన్నారు. గద్దెరాగడి ప్రాంతంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల యాజమాన్యం సీబీఎస్ఈ అనుమతులు లేకున్నా తరగతులు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తుందని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న డీఈవో, ఎంఈవోలను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. నాయకులు కుతుబ్, జతిన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల అబద్ధపు ప్రచారం

ఏసీసీ: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అబద్ధపు ప్రచారాలతో అడ్మిషన్‌లకు తెరలేపాయని వాటిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. ధనార్జనే ధ్యేయంగా పలు కార్పొరేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని, విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేస్తున్నాయన్నారు. అబద్ధపు ప్రచారాలతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి అందించిన ఫీజుల వివరాలు, అనంతరం వసూలు చేస్తున్న ఫీజులకు పొంతన ఉండడం లేదన్నారు.

ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 2: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్, సెక్టార్ అధికారులకు ఎన్నికల సంబంధిత అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలింగ్ రోజు పొరపాటు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రిసెప్షన్ కేంద్రాల వద్ద కౌంటర్ల వారీగా పోలింగ్ కేంద్రాలు కేటాయించాలని, ప్రతీ కౌంటర్‌కు ఒక ప్రత్యేక అధికారి, సాధారణ అధికారిని నియమించాలన్నారు. ఎన్నికల సంబంధిత సామగ్రి, ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, బ్యాటరీలు, పేపర్లు, డైరీ నిర్వహణ తదితర ప్రతి అంశాన్ని పరిశీలిం చాలన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఆహారం, తాగునీరు ఇతర అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా సహాయ రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. అత్యవస సేవలు అందిస్తున్న వారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు వెబ్ కాస్టింగ్ ద్వారా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో జరిగే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించాలని, తహసీల్దార్‌లు బ్యాలెట్ సంబంధిత నివేదికను అందించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి సప్లిమెంటరీ షెడ్యూలు విడుదల

ఏసీసీ, మే 2: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ గురువారం విడుదల చేశారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష ఫీజు ఈనెల 16 లోగా చెల్లించాలని సూచించారు. వివరాలకు పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

బాక్సింగ్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

బెల్లంపల్లి, మే 2: పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో బాక్సింగ్ కోచింగ్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని రిటైర్డు ఎంఈవో శ్రీధర్ స్వామి అన్నారు. బుధవారం రాత్రి క్రీడా మైదానం ఆవరణలో బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోచ్ రామకృష్ణ, సీనియర్ క్రీడాకారులు విజయ్, పాల్గొన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, మే 2: రామగుండం కమిషనరేట్ పరిధిలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో కేంద్ర బలగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు పోలీసులతో కలిసి పని చేస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు, పోలింగ్ రోజున ఎన్నికల తర్వాత స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత, కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఓటర్లు భయాందోళనలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహిస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో స్టాటిక్ బందోబస్తు కల్పిస్తామన్నారు. కేంద్ర బలగాలు ఉండడానికి సరైన సౌకర్యాలు కల్పించాలని ఏసీపీలను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల భద్రత కోసం రామగుండం కమిషనరేట్‌కు సీఆర్‌పీఎఫ్ నుంచి రెండు కంపెనీలు, బీఎస్ఎఫ్ నుంచి మూడు కంపెనీలు, మొత్తం 5 కంపెనీలకు చెందిన 443 మంది సిబ్బంది వచ్చారన్నారు. డీసీపీ అశోక్ కుమార్, సీఆర్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ ఏకే పాండే, పరమానంద్ యాదవ్, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెం ట్‌లు డేవిడ్‌లాల్, భరత్‌సింగ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల సీఐ బన్సీలాల్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన అదనపు బ్యాలెట్లు



బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 2 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల , బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్‌లు వచ్చాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్‌లోని ఈవీఎం గోదాంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి రాజకీయ పార్టీల సమక్షంలో బ్యాలెట్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతోపాటు అదనపు బ్యాలెట్ యూనిట్‌లు అవసరం ఉన్నందున ఈసీఐఎల్ కంపెనీ నుంచి జిల్లాకు 1800 అదనపు బ్యాలెట్ యూనిట్లు వచ్చాయన్నారు. వీటి ర్యాండమైజేషన్ పూర్తయినా తర్వాత ఆయా సెగ్మెంట్లకు బందోబస్తు మధ్య తరలించి స్ట్రాంగ్‌రూంలలో భద్రపరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి

హాజీపూర్, మే 2 : దొనబండలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నారని, పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మిట్టపల్లి తిరుపతి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎండ వేడి 48 డిగ్రీలు ఉందని, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చుంచు లక్ష్మయ్య స్ఫూర్తితో ఉద్యమిద్దాం

ఏసీసీ, మే 2 : దివంగత ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య స్ఫూర్తితో బీసీ హక్కుల సాధనకు ఉద్యమించాలని తెలంగాణ బీసీ జాగృతి నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని కోరారు. డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, ఏదునూరి రమేష్, సదానందం, మల్లేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆరుగురు పేకరాట రాయుళ్ల అరెస్టు

హాజీపూర్, మే 2: హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని నర్సింగాపూర్ శివారు రాజేశ్వర్‌రావుపల్లిలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐసురేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారివద్దనుంచి రూ.6100నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట, జూదం ఆడితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు

అగ్ని ప్రమాదం

జన్నారం, మే 2 : మండలంలోని రేండ్లగూడ శివారులో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామ సమీపంలో మం టలు చెలరేగడంతో గ్రామస్థులు నీటితో ఆర్పే ప్రయత్నం చేయగా మంటలు చల్లారకపోవడంతో పోలీసులకు సమా చారం అందించారు. పోలీసులు వెంటనే ఫైర్ సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ముడికె ఐలయ్యకు చెందిన ఒక ఎకరంలో పండిన ఆరబోసిన మక్కలు, 11 పైపులు, అలాగే తొట్ల నారాయణకు చెందిన 30 పైపులు, నందవేని లింగన్నకు చెందిన 15 పైపులు మంటల్లో కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని ఏఈవో త్రిసద్య పరిశీలించారు. ఫైర్ సిబ్బంది లక్ష్మీనారాయణ, శ్రీని వాస్, ఎఫ్‌ఎం వేణుగోపాల్, డీపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో లారీలో చెలరేగిన మంటలు



లారీలో చెలరేగిన మంటలను ఆర్పివేస్తున్న గ్రామస్థులు

వేమనపల్లి, మే 2 : మంచిర్యాల నుంచి వేమనపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న గన్నీ సంచులు విద్యుదాఘాతంతో కాలిపోయాయి. గన్నీ సంచులతో మంచిర్యాల నుంచి వస్తున్న లారీ బుయ్యారం గ్రామానికి రాగానే పైన ఉన్న విద్యుత్ తీగలు లారీకి తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిప్పులు లారీలో ఉన్న గన్నీ సంచులపై పడడంతో సంచులకు మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్థులు చాకచక్యంగా వ్యవహరించి మూడు పంపుసెట్ల నీటితో మంటలను ఆర్పివేశారు. సంఘటనలో దాదాపు 10వేల గన్నీసంచులు కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. కాలిపోయిన గన్నీ సంచులను అదే లారీలో జిల్లా కేంద్రానికి తరలించారు.

ఉత్తమమైన ఫలితాల సాధన అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 2: ఒత్తిడి లేని విద్యాబోధన విధానంతో పదోతరగతిలో ఉత్తమమైన ఫలితాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) విద్యార్థులను అభినందించారు. కలెక్టర్‌మాట్లాడుతూ సీఈవోలో 74 మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణత సాధించడం, 6గురు వినయ్, అభినయ్ తేజ్, జశ్వంత్, విని ల్‌కుమార్, ప్రణయ్ చరణ్, శశివర్ధన్ 10 జీపీఏ సాధించడం ఆదర్శనీయమన్నారు. డీఈవో యాదయ్య, ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులుప్రమోద్‌కుమార్, వామన్, పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ... తప్పిన ప్రమాదం

జైపూర్, మే 2: మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి రెండులారీలు ఢీకొన్న సంఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి మంచిర్యాల వైపు బూడిద లోడుతో వెళ్తున్న లారీ మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపు వస్తున్న లారీ ఎక్స్ రోడ్డు వద్ద వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు, క్లీనర్లకు ఎ లాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. లారీలు స్వల్పంగా దెబ్బతిన్నాయన్నారు.

సింగరేణి కార్మికులు మద్దతు ఇవ్వాలి

బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 2: సింగరేణి కార్మికులు తనకు మద్దతు ఇవ్వాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కార్మికవర్గానికి వివేక్, మక్కాన్‌సింగ్, కొప్పుల ఈశ్వర్‌ల చరిత్ర తెలుసన్నారు. తాను 26ఏళ్ల పాటు సింగరేణి కార్మికుడిగా ఓసీపీలో పని చేశానని, 5వ వేజ్‌బోర్డుకు ఆరు రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసిన చరిత్ర తనదన్నారు. 7ఎల్ఈపీ ఘటన సందర్భంలో కార్మికుల పక్షాన పోరాడినందుకు 15రోజులు జైలుకు వెళ్లానని, 45రోజుల కార్మికుల సమ్మె సందర్భంగా నాసా చట్టం కింద జైల్లో ఉన్నానని, ఇది తన చరిత్ర అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి కార్మికవర్గానికి 35రోజుల సకల జనుల సమ్మె కాలం నాటి వేతనం తిరిగి కార్మికులకు ఇప్పించామని, కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చిందని, కాంగ్రెస్ హయాంలో పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాలుగా మార్చి పదేళ్లలో 19వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. లాభాల వాటా 18శాతం ఉంటే 32శాతానికి పెంచామని, దీనిపై గోదావరిఖని చౌరస్తాలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. సామాజిక న్యాయం అంటే ఒకే కుటుంబంలో మూడు పదవులు పొందడం కాదని, స్థానికంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ నాయకుల అవకాశాల్ని ఒకే కుటుంబం లాక్కోవడం అంబేద్కర్ చెప్పిన సిద్ధంతామా అని ఆయన ప్రశ్నించారు. వివేక్ కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎందుకు కర్మాగారాలు పెట్టడం లేదని ప్రశ్నించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌కు రాజకీయ నైతికత లేదని ధ్వజమెత్తారు. వివేక్ రాజకీయ అనైతికతను చూసి ఆయన తండ్రి ఆత్మ ఘోషిస్తుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు మక్కాన్‌సింగ్ కూడా అబద్ధాలు మాట్లాడుతున్నాడని అన్నారు. ఇక్కడి ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వివేక్‌వెంకటస్వామి ఎప్పుడైనా ఆదుకున్నాడా అని, ఎవరికైనా ఉపాధి కల్పించాడా అని ఈశ్వర్ అన్నారు. నిత్యం ప్రజలమధ్య బతుకుతున్న తనను విమర్శించడం అర్థరహితమన్నారు. కేసీఆర్‌కు తెలంగాణలో వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక కుట్ర పూరితంగా బస్సు యాత్రను కాంగ్రెస్ ఆపిందని, కానీ కాం గ్రెస్‌పై తెలంగాణ ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతను ఆపలేరన్నారు. శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో కేసీఆర్ రోడ్‌షో ఉంటుందని, అందుకు ప్రజలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు పీటీ స్వామి, పెంట రాజేష్ పాల్గొన్నారు.

ఇండియా కూటమిదే విజయం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


కూలీలతో కలిసి పని చేస్తున్న గడ్డం వివేక్

మందమర్రి టౌన్, మే 2: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం శ్రీపతినగర్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్‌ల నేతృత్వంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు ఒకటేనని, దేశ వ్యాప్తంగా పది సంవత్సరాల మోదీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. బత్తుల రమేష్, మండ భాస్కర్, శ్రీనివాస్, రజని పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఎంఐఎం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారు. ఇమ్రాన్, ముజీమ్, ఇమ్రాన్, నసీర్, షాకీర్, నాయబ్, షబ్బార్‌ఆలీ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరుతూ పట్టణం లోని 7,8 వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని కోరారు. నాయకులు గుడ్ల రమేష్, మహంత్ అర్జున్‌కుమార్, సంగి సంతోష్, పాషా, శేఖర్, మహిళ నాయకురాల్లు పాల్గొన్నారు.

పట్టణంలోని 24వ వార్డులో పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, నాయకులు సొత్కు సుదర్శన్‌లు ఇంటింటా తిరుగుతూ వంశీ వివేక్‌ను గెలిపించాలని కోరారు.

జైపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కు పట్టం కట్టాలని ఎమ్మెల్యే వివేక్ పేర్కొ న్నారు. మండల కేంద్రంలో పలువురు బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. చిత్తాపూర్, పౌనూరు, శివ్వారం గ్రామాల్లో రోడ్‌షోలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నెన్నెల: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ పని స్థలాలకు వెళ్లి కూలీలతో కలిసి మట్టి పని చేశారు. కేంద్రంలో ఇండియా కూటమి గెలిస్తే ఉపాధి కూలీల కష్టాలు దూరమవుతాయన్నారు. గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, దాగం రమేష్, సుజాతశ్రీనివాస్, మల్లిక, శంకరయ్య, పాల్గొన్నారు.

దండేపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. పాతమామిడిపల్లితో ఆల్లీపూర్, నాగసముద్రం, మ్యాదరిపేట గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల వద్ద వెళ్లి మజ్జిగ ప్యాకెట్ పంపిణీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించినట్లు పార్లమెంట్ ఎన్నికలో కూడా గెలిపించాలన్నారు. రాంచందర్, ఎల్తెపు శ్రీనివాస్, గొట్ల మహేందర్, ఆరెపల్లి రమేష్ పాల్గొన్నారు.

చెన్నూరు: సుద్దాలలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం చేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంకాగౌడ్, హేమంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు అంబలి పంపిణీ

దండేపల్లి,మే 2: కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్, వనపర్తి భూమయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పెద్దపేట, మ్యాదరిపేట గ్రామాలలో చెరువు వద్ద ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలకు మొబైల్ ఆటో ద్వారా వనపర్తి మౌలికరవిలు అంబలి పంపిణీ చేశారు. కూలీలు ప్రజలు, బాటసారులు, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎండవేడి నుంచి ఉపశమనం పొందారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

చెన్నూరు, మే 2: మండలంలోని కిష్టంపేటలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓట్లు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచు బుర్ర రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నస్పూర్: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 14, 19 వార్డుల్లో నాయకులు ప్రచారం చేశారు. సీసీసీ 14వ వార్డులో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, 19వ వార్డులో రాష్ట్ర యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు అక్కురి సుబ్బయ్య, వంగ తిరుపతి, మండల క్రాంతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం


మాట్లాడుతున్న సదానందం యాదవ్

మందమర్రిటౌన్, మే 2 :కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ వివేక్‌దే విజయ మని, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. మందమర్రిలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రం నష్టపోయిందన్నారు. రైతులు గిట్టుబాటుధర కోసం ఢిల్లీలో ఆందోళన చేసినా బీజేపీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. మారుతినగర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు.

అహంకారపూరితంగా మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు


రామగిరిలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

రామగిరి, మే 2: మంత్రి శ్రీధర్‌బాబు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీలోని తెలంగాణ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో 35 ఎంఎం మాత్రమే చూశారని, 70ఎంఎం సినిమా చూపిస్తానని మంత్రి అహంకార ధోరణితో మాట్లాడు తున్నాడని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించిన శ్రీధర్‌బాబు ఏ ఒక్కదాన్ని అమలు చేయలేదన్నారు. దేశం కోసం పరితపించే మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని, తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యం

దండేపల్లి: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే సుస్థిరపాలన సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య అన్నారు. వెల్గనూర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచా రం చేపట్టి పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ మల్లవ్వలక్ష్మినారాయణ, నాయకులు ఏసయ్య, సంజీవ్, సత్యం, అరుణ్, సంతోష్, కిషన్ పాల్గొన్నారు.

మహిళా మోర్చా పట్టణాధ్యక్షురాలిగా దీపారాణి



బెల్లంపల్లి, మే 2: మహిళ మోర్చా బెల్లంపల్లి పట్టణాధ్యక్షురాలుగా ముడిమడుగుల దీపారాణి నియమితులయ్యారు. గురువారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి కమల, స్వప్నరాణిలు నూతన కమిటీని ప్రకటించారు. పట్టణ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులుగా డొంగిరి శారద, పూదరి శ్రీలత, స్వప్న, ఊహ ప్రసన్న, స్వర్ణలత, సంగీత, కోశాధికారిగా లక్ష్మీ, కార్యదర్శులుగా విజయ, అలేఖ్యలను ఎన్నుకున్నారు.

మందమర్రిలో ఫ్లాగ్‌మార్చ్



మందమర్రిటౌన్, మే 2: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్ నుంచి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా రాష్ట్రీయ రహదారి మీదుగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టబందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ రాజశేఖర్, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్ మిశ్రా, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం : మంత్రి శ్రీధర్‌బాబు


కమాన్‌పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్, మే 2: రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని గెలిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. గురువారం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఎన్నికల ప్రచా రం చేశారు. కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు నుంచి జూలపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన ఆవశ్య కత ఉందన్నారు.

రామగిరి: కార్మికుల సొంతంటి కలను సాకా రం చేస్తామని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 లో గడ్డం వంశీకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడారు. సింగరేణి ప్రాంతంలో అనుబంధ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికే ఎమ్మార్పీఎస్ మద్దతు

నస్పూర్, మే 2 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొంకట రవీందర్ తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తామంతా గడ్డం వంశీ కృష్ణకు మద్దతు తెలిపి గెలిపించుకోవడానికి కృషి చేస్తామన్నారు. నాయకులు తిప్పారపు రమేష్, లక్ష్మయ్య, దుమ్మటి నరేష్, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీఎం'లో పరుచుకున్న పచ్చదనం

● కాలనీల్లో చెట్లతో ఆహ్లాదకర వాతావరణం


ఎస్పీఎం గేటు ఎదుట, ప్రధాన రోడ్డుపై పచ్చని చెట్లు

కాగజ్‌నగర్, మే 2: కాగజ్‌నగర్ ఎస్పీఎం గేటు సమీపంలోఉన్న చెట్లు దారిన పోయే వాడికి నీడనిస్తూ ఆహ్లాదకరంగా ఉన్నాయి. కార్మికులంతా ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చెట్లనీడన సేదతీరుతున్నారు. కిలోమీటరుమేర ఈచెట్లు ఉండటం విశేషం. మిల్లు ప్రారంభసమయంలో అప్పటియాజమాన్యం కార్మికులను దృష్టిలో పెట్టుకొని మొక్కలనునాటారు. నాటి మొక్కలు ఇప్పుడు చెట్లుగా ఎదిగాయి. కార్మికులకే కాకుండా బాటసారులు చెట్ల నీడన సేదతీరుతున్నారు. ఎస్పీఎంకు సంబంధించిన ప్రధానక్వార్టర్లు సీడీబీ టైపు, టిప్పర్‌లైన్‌కాలనీలో గణనీయమైె చెట్లుఉన్నాయి. కాలనీ అంతాకూడా పచ్చని వాతావరణం కన్పిస్తోంది. దీంతో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కన్పిస్తోందని ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెంచికలపేట, మే 2: మండలంలోని బొంబాయిగూడ, పోతెపల్లి, చెడ్వాయి, దర్గపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు పర్యటించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు మధుకర్ తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యార్థినికి సన్మానం

ఆసిఫాబాద్ రూరల్, మే 2: జిల్లా కేంద్రంలోని ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలకు చెందిన జోయ ఆఫ్రీన్ ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 10జీపీఏ మార్కులు సాధించడంతో గురువారం డీఈవో అశోక్ విద్యార్థినిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఫయాజ్, కరస్పాండెంట్ అబ్దుల్ హసన్, ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.

ఎండ ప్రచండం!

● జిల్లాలో దంచికొడుతున్న ఎండలు
● జిల్లాలో అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత
● పొద్దంతా బయటకు రావడానికి జంకుతున్న జనం
● పెరిగిన వడగాలులు


నెత్తికి టవాల్ కట్టుకొని వెళ్తున్న ఎస్పీఎం కార్మికుడు


ఎండవేడిమికి గొడుగు పట్టుకొని వెళ్తున్న వృద్ధుడు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, మే 2: సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఎండలు, వడగాల్పులతో జనం అల్లాడుతున్నారు. జిల్లాలో దినదినం ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. గురువారం జిల్లాలో 45.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉక్కపోత, వేడికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. వడదెబ్బతో ఇటీవల బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లిగ్రామంలో చౌదరిరవి(22), గురువారం అదే మండలం గబ్బాయి గ్రామానికి చెందిన పోరిశెట్టి శ్రీనివాస్(47)వడదెబ్బతో మృతిచెందారు. ఎండలతీవ్రత మరింత ఎక్కువయ్యే అవకాశం ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బయటకు రాలేకపోతున్న జనం..

భానుడి ప్రతాపానికి తోడు గాలిలో తేమశాతం తగ్గుతుండడంతో వేడిగాలులు, తీవ్రమైన ఉక్కపోతలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు మండుతుండడంతో భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వేడి నుంచి బయట పడుటకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఉక్కపోతకు చెకపెట్టడానికి కూలర్లు, ఏసీల ముందు కూర్చొని ఉపశమనం పొందుతున్నారు. కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులు రుమాలు చుట్టుకొని విధులకు వెళ్తున్నారు. నాలుగు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొబ్బరి బొండాలు, జ్యూస్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తోంది.

మహర్ కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు

● మంత్రి సీతక్క

జైనూర్, మే 2: రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క గురువారం రాత్రి జైనూరు మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా మైనార్టీ, మహర్ సంఘం నాయకులు మంత్రి సీతక్కకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మహర్ కులస్థుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మహర్ కార్పొరేషన్ మంజూరు చేయాలని నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్నికులాలకు కార్పొరేషన్లు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మహర్, నేతకానీలు అత్యంత దయనీయంగా, అభివృద్ధికిదూరంలో ఉన్నట్లు తనదృష్టికి వచ్చిందన్నారు. తప్పక ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళి కొద్దిరోజుల్లోనే నేతకాని, మహర్ కార్పొరేషన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దళితనాయకులు భరత్ వాగ్మారె, నాగోరావ్ జాడె, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మైనార్టీ నాయకులు భుట్టు ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, నాయకులు సుద్దాల ఆనంద్, సుద్దాల శ్రీనివాస్ అన్నాబావు సాతె, అంబేద్కర్ సంఘం నాయకులు కాంబ్లే బాబా సాహేబ్, దత్త మవాలె, కాంబ్లే బావుసాహేబ్, కాంబ్లే నాగోరావ్, భుతాలె వెంకట్‌రావ్, షేక్ అబ్బు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరు మృతి


శ్రీనివాస్(ఫైల్)

బెజ్జూరు, మే 2: మండలంలోని గబ్బాయి గ్రామానికి చెందిన పోరిశెట్టి శ్రీనివాస్(47) వడ దెబ్బతో గురువారం వేకు వజామున మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెండు రోజుల క్రితం బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. అనంతరం అస్వ స్థతకు గురయ్యాడు. బుధవారం అర్ధరాత్రి తీవ్రఅస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు వైద్యంకోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు.

మెరుగైన ఆరోగ్యం కోసం 'యోగా'

● యోగాపై ఆసక్తి చూపిస్తున్న పట్టణవాసులు ● పట్టణంలో ఏర్పాటైన పది ఉచిత శిక్షణశిబిరాలు

● ప్రజల నుంచి అనూహ్య స్పందన


యోగా శిబిరంలో ఆసనాలు వేస్తున్న కాలనీ వాసులు

కాగజ్‌నగర్, మే 2: డిజిటల్ ప్రపంచంలో పని ఒత్తిడి, మానసిక ఇబ్బందులతో ప్రజలు తరుచూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీని నివారణకు, శరీర సమతుల్యతను కాపాడుకోవటం, ఆరోగ్యకరమైన అలవాట్ల కోసం యోగా చక్కటి బాటలు వేస్తుంది. యోగా నేర్చుకోవటంతో దీర్ఘకాలిక వ్యాధులు ఇట్టే నయయం అవుతాయి. యోగా ఆసనాలతో మానసిక ఆరోగ్యం, కీళ్ల నొప్పులు, కండరాలు, వెన్నుపూస నొప్పి తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అందరికీ యోగా నేర్పాలన్న లక్ష్యంతో పతంజలి పీఠ్ ఆధ్వర్యంలో సిర్పూరు నియోకవర్గంలో వివిధ ప్రాంతాల్లో యోగా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్‌లోని 30వార్డుల్లో పది కేంద్రాలు నడుస్తున్నాయి. యోగా నేర్చుకునేందుకు మహిళలు అధికంగా వస్తున్నారు. గుండె జబ్బుల వ్యాధులున్న వారు కూడా శరీర బరువు తగ్గించుకునేందుకు యేగా నేర్చుకునేందుకు ప్రాముఖ్యతనిస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి యోగా శిబిరాలు ప్రారంభమవుతున్నాయి. పట్టణంలోని సర్ సిల్క్‌ఏరియా, ఎస్పీఎం క్రీడామైదానం, బాలభారతి పాఠశాల, బాలాజీనగర్ ఏరియాలతో పాటు పలు కాలనీల్లో నిత్యం ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అరగంట తర్వాత ప్రకృతిలో లభించే పండ్లతో తయారు చేసిన పానీయాలు, నానబెట్టిన శనగలు, పల్లిలు, పెసర్లు ఇస్తున్నారు. దీంతో బరువు తగ్గటమే కాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు శరీరం ఆలసట లేకుండా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

● యోగాతో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి..

- ఎం ఠాకూర్, యోగా గురువు



యోగాను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి. ధ్యానంతో శరీర సమతుల్యత ఏర్పడుతుంది. తద్వారా బీపీ సమస్య ఉండదు. అలాగే ఆసనాల ద్వారా పలు దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయి. చెడు అలవాట్లు దూరమవుతాయి.

● పని ఒత్తిడి ఉన్నా కూడా..

- రమ్య రెడ్డి, కాగజ్‌నగర్



నా ఉద్యోగంలో అనేక ఒత్తిడిలుంటాయి. అయినా కూడా ఏ ఒక్కనాడు యోగాను విడిచిపెట్టలేదు. ఉదయం ఐదు గంటలకల్లా వచ్చి యోగా ఆసనాలు, ధ్యానం, శ్వాసకోస ప్రక్రియలకు సంబంధించిన ఆసనాలు వేస్తా. దీంతో ఉదయంనుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉంటుంది.

● ఒక్కరోజు కూడా తప్పలేదు..

- స్వాతి డాకుల్కర్, కాగజ్‌నగర్



యోగా శిబిరానికి ప్రతి రోజు వస్తాను. అలవాటు అయి పోయింది. ఉదయం ఐదు గంటల కల్లా యోగా ప్రారంభమవుతుంది. చాలా చక్కగా నేర్పుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేవు. ఆరోగ్యం కూడా చాలా చక్కగా ఉంది.





సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బీజేపీకి ఓటేస్తే.. రిజర్వేషన్లు పోయినట్టే



సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర
- జనాభా గణన చేయకపోవడమే ఇందుకు నిదర్శనం
- ఎన్నికల్లో కర్రు కాల్చి బీజేపీకి వాతలు పెట్టాలి
- పదేళ్ల పాలనలో దోపిడీకి తెరలేపిన బీఆర్ఎస్
- హామీలిచ్చాం.. వందరోజుల్లో అమలు చేశాం..
- లక్ష ఓట్ల మెజార్టీతో సుగుణక్కను గెలిపించాలి
- జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్ మే 2: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని దీన్ని తిప్పికొట్టేందుకు అంతా సన్నద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో ఏర్పాటు చేసిన జనజాతర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీకి ఓటేస్తే మీ రిజర్వేషన్లు పోయినట్టేనని పేర్కొన్నారు. అంతా అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ప్రతి పది సంవత్సరాల కొకసారి జనాభా గణన చేసిందన్నారు.

ఈ గణన చేయటంతో నిరుపేదలు, కులాల వారీగా రిజర్వేషన్ల లెక్కలు తేలే అవ కాశాలుండేవన్నారు.2021లో జనగణన చేయాల్సిన బీజేపీ ప్రభుత్వం జనాభా గణన చేయక పోవటమే ఇందుకు నిదర్శన మన్నారు. దీన్ని బట్టి పరిశీలిస్తే రిజర్వేషన్లు రద్దు చేసేందుకు పక్కాగా ప్రణాళికలు పన్నినట్టు తెలుస్తోందన్నారు. ఈ విషయాలను తాను ప్రస్తావిస్తే తనపై ఢిల్లీ పోలీసులతో కేసులు పెట్టించిందన్నారు. పోరాటాల గడ్డ ఆదిలాబాద్ ప్రజల అండతో ఢిల్లీ సుల్తాన్‌లను ఎదుర్కొంటానన్నారు. తెలంగాణ ప్రాంతానికి కేంద్రం ఏమీ ఇచ్చిందని ప్రశ్నించారు. అలాగే పీఎం మోదీ ఏం చేశారని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్శిటీ ఇచ్చిందా..? సిమెంటు ఫ్యాక్టరీని తెరిపించిందా..? కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చిందా..? బయ్యారం ఉక్కు కర్మాగారం సమస్య పరిష్కరించిందా..? అంటూ సభికులను ప్రశ్నిస్తూ తనదైన శైలిలో గాడిద గుడ్డు ఇచ్చిందంటూ అందరిచే అన్పించారు. అదే తాము రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేసినట్టు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు ఉచితంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500గ్యాస్ సబ్సిడీ కల్పించినట్టు వివరించారు. 30 వేల నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చినట్టు పేర్కొన్నారు. 22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను కట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటే నిరుపేదల పార్టీని అని అన్నారు. తనను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చర్లపల్లి జైలుకు పంపినా భయపడ లేదని, ఇప్పుడు కేంద్రం తన పై డిల్లీ పోలీసులతో కేసులు పెడితే ఈ రేవంత్‌రెడ్డి భయ పడుతాడా..? అని పేర్కొనటంతో సభలో చప్పట్లు మోగాయి. ఈ ప్రాంతంపై తనకెంతో అభిమానం ఉందన్నారు. కుమరం భీం, రాంజీ గోండ్ స్ఫూర్తిగా ఆదివాసీ బిడ్డలు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. గోండ్‌లు, లంబాడాలు తమ హక్కుల కోసం పోరాడితే అటు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సమస్యను పరిష్కరించేలేదన్నారు. తాను ఇంద్ర వెల్లి వేదికగానే తొలిసారి ఎన్నికల శంఖారావం పూరించినట్టు తెలిపారు. సీఎం హోదాలో మళ్లీ ఇంద్రవెల్లికి వచ్చి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తొలి సంతకం చేసినట్టు తెలిపారు. అలాగే అమరవీరుల కుటుంబాలకు ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఏ పార్టీ ఇప్పటివరకు ఆదిలాబాద్ పార్లమెంటు నియోజక వర్గానికి మహిళ అభ్యర్థిని కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈసారి గిరిజనబిడ్డకు అవకాశం ఇచ్చిందన్నారు. సుగుణక్కకు ఈ ప్రాంతంపై ఎంతో అవగాహన ఉందని, ప్రజల కష్టాలపై పోరాడే సత్తా ఉందన్నారు. ఎన్నికల్లో సుగుణక్కను లక్ష మెజార్టీతో గెల్పించాలని కోరారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ బీజేపీ పేదల పార్టీ కాదని దోపిడి పార్టీ అని అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని కేంద్రం యోచిస్తోందని, దీన్ని తిప్పికొట్టాలన్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ రైతు రుణ మాఫీని ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తుందని రైతు బంధును దశల వారీగా ఇస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ త్యాగాల పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటల్లో ఐదు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను గుర్తించి టికెట్ ఇచ్చిందని కొంగుచాటి అడుగుతున్నా తనకు ఒక సారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జడ్పీ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్టారావు, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే కోనప్ప, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీష్, రాములు నాయక్, మాజీ జడ్పీచైర్మన్ గణపతి, పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, నరేష్ జాదవ్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణ

సీఎం సభ సక్సెస్

- ఎండ వేడి ఉన్నా తగ్గని జనం
- ఆసిఫాబాద్ పట్టణమంతా కాంగ్రెస్ మయం



(ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్): పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఆసిఫాబాద్ ప్రేమల గార్డెన్ సమీపంలో ఏర్పాటు జనజాతర బహిరంగ సభ సక్సెస్ అయింది. ఉదయం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివిధ వాహనాల్లో ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. ప్రేమల గార్డెన్ సమీపంలోకి ఆటోలు, బైక్‌లు, ఇతర వాహనాలను నిలుపకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఒకవైపు ఎండ తీవ్రత ఉన్నా సభ పూర్తిగా సక్సెస్ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. ఎండ వేడిమి తట్టుకునేందుకు కూలర్లను ఏర్పాటు చేశారు. అలాగే ప్రతికౌంటర్ వద్ద డ్రమ్ముల్లో తాగునీటి వసతి కల్పించారు. పాస్‌లున్న వారికి కేటాయించిన కౌంటర్‌కు చేరేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చారు.

సీఎం సభ సైడ్ లైట్స్

- సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4.12గంటలకు హెలి క్యాప్టర్ ద్వారా ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు.
- 4.22 గంటలకు సభాస్థలికి చేరుకోగా, సభికులు నిల్చోని అభివాదం తెలుపుతూ కేకలు వేశారు.
- 4.38 గంటల నుంచి 5.05 గంటల వరకు 27 నిమిషాల పాటు సీఎం ప్రసంగించారు
- సీఎం ప్రసంగం ముందు మూడురంగుల జెండా అంటూ పాటపెట్టడంతో యువకులు కేరింతలు కొట్టారు
- వేదికపైనే స్థానిక నాయకులతో సీఎం మాట్లాడారు
- సభా వేదికలో తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతున్నారని పదే పదే మైక్‌లో నాయకులు చెప్పారు
- సీఎం రేవంత్‌రెడ్డికి మహారాష్ట్ర వాసులు ధరించే టోపీని పెట్టారు
- మంత్రి సీతక్క మాట్లాడాలని చెప్పగానే పెద్దఎత్తున కేరింతలు కొట్టారు
- అభ్యర్థి ఆత్రం సుగుణ తాను కొంగుచాచి ఓట్లు అడుగుతున్నాని గ్యాలరీ వద్దకు వచ్చింది.
- వీఐపీ గ్యాలరీలోకి గుర్తింపు కార్డులు లేని వారి ని కూడా అనుమతించాలని పదేపదే నాయ కులు మైక్‌లో ప్రకటించారు
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సీఎంను చూసేందుకు జనాలు ఎగబడ్డారు
- సీఎం తన ప్రసంగంలో లక్షా... పక్కా...ఓట్ల మెజా ర్టీ అంటూ పలుమార్లు సభీకులచే అన్పించారు.
- వాటర్ వ్యాన్‌ను పోలీసులు అపారంటూ వెం టనే వదిలేయాలని మైక్‌లో నాయకులు ప్రక టించారు.
- సభాస్థలి వద్దకు పోలీసులు వాహనాలను అనుమతించలేదు
- సీఎం ప్రసంగంలో కేంద్రం చేసింది ఏమీలేదని గాడిద గుడ్డు అంటూ రెండు బొమ్మలు చూపిస్తూ ఎద్దేవా చేశారు.

మాజీ ఎమ్మెల్సీతో సీఎం మంతనాలు

ఆసిఫాబాద్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌తో మంతనాలు జరిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జిల్లాకేంద్రానికి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్సీని పిలిచి ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళిని అడిగి తెలుసుకున్నారు. ఆసిఫాబాద్‌లో పరిస్థితి ఎలాఉంది..? బీఆర్ ఎస్ నాయకులు జాయిన్ అయ్యారా..? అని వాకాబు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్సీ జాయిన్ అయ్యారని నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మెజార్టీ సాధించి పెడతానని సీఎంకు తెలిపారు.



సభావేదికపై నాయకులు, ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



భీంజీగూడలో ప్రచారం నిర్వహిస్తున్న మహిళ ప్రజాప్రతినిధులు

జైనూర్, మే 2: బీఆర్ఎస్ ఎంపీఅభ్యర్థి ఆత్రం సక్కును భారీమెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం మహిళా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని దుబ్బగూడ, భీంజీగూడ తదితర గ్రామాల్లో ఎంపీపీ కుంర తిరుమల, తాజా మాజీసర్పంచులు మేస్రాం పార్వతీబాయి తదితరులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుంర తిరుమల మాట్లాడుతూ ప్రస్తుతం రైతుబంధు, కల్యాణ లక్ష్మి, రైతుబీమా తదితర పథకాలు అందక పోవడంతో ప్రజలు, రైతులు అయోమయంలో పడ్డారని అన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును భారీమెజార్టీతో గెలపించాలని వారు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మార్లావాయి మాజీ సర్పంచ్ జుగునాక సావిత్రిబాయి, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభి వృద్ధి సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, నాయకులు తుకారాం, పెంటు, అశోక్ తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్, మే 2: లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది విధినిర్వహణలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్‌వ్యాస్ అన్నారు. గురు వారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్, హైదరాబాద్ నుంచి ఎన్నికలప్రధాన అధికారి వికాస్ రాజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లపై మాట్లాడారు. ఎన్నికల సమయంలో భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలన్నారు. పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్న నియోజకవర్గా లకు అదనపు బ్యాలెట్‌యూనిట్లు చేరుకు న్నాయని ఈవీఎం, బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కె సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, మే 2: వాంకిడి మండలం ఖిరిడి గ్రామంలో భూతగాదా విషయంలో జంటహత్యలు చేసిన కేసులో ఆరుగురు నిందితులకు జీవితఖైదు విధిస్తూ జిల్లాసెషన్స్‌కోర్టు ప్రధాన న్యాయ మూర్తి ఎంవీ రమేష్ గురువారం తీర్పు చెప్పారు. వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలప్రకారం.. జూన్21,2019రోజున భూతగాదాలను దృష్టిలోపెట్టుకొని తొడసం బొజ్జిరావు, సెడ్మకే గంగరాం, సెడ్మకే తెలంగ్ రావు, సెడ్మకే యశ్వంత్‌రావు, సెడ్మకే జంగు, తొడసం శారద పథకం ప్రకారం ఖిరిడి గ్రామశివారులో రాయి సిడాం శ్యాం రావు, అతనిభార్య రాయిసిడాం తారబాయిలను హత్య చేశారు. మృతుల కుమారుడు రాయి సిడాం విలాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలిసులు కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈ మేరకు పోలీసులు సాక్షులను కోర్టులో హాజరు పరుచగా పీపీలు జీవీఎస్ ప్రసాద్, జగన్ మోహన్‌రావు సాక్షులను విచారించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైఆరుగురికి జీవితఖైదుతో పాటు రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, కోర్టు లైజనింగ్ అధికారులు రాంసింగ్, పోశెట్టి, కోర్టుసిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే

- ఎమ్మెల్సీ దండె విఠల్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూరు, మే 2: సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్, ఇతర పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలను చూసి ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, జనార్దన్, రాజన్న, రాజేష్, రమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

కెరమెరి, మే 2: మండల కేంద్రంలో గురువారం బీజేపీ కార్యాలయాన్ని ఆపార్టీ నాయకులు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌నాయక్, వేణుగోపాల్, ఉత్తంనాయక్, శ్రీకాంత్, తుకారాం, రవినాయక్, లాల్‌సింగ్, రాంకిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన నాయకులు

వాంకిడి, మే 2: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన సీఎం సభకు వాంకిడి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. వెళ్లినవారిలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి)లో చోరీ

సిర్పూర్(టి), మే 2: మండల కేంద్రంలోని పేట్‌మహిళా కాలనీకి చెందిన అబ్దుల్ అస్లం ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 19న తన సోదరి కూతురి వివాహానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఇది గమనించిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తిరిగివచ్చిన అస్లం ఇంట్లోని బీరువా పగుల గొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్సై రాములు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 21తులాల వెండి, తులం బంగారం, రూ.11వేల నగదు చోరీకి గురైనట్లు బాధి తుడు పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దొంగలు పగుల గొట్టిన బీరువా



ఐటీతో ఆర్థికంగా నష్టపోతున్న కార్మికులు

మందమర్రి టౌన్, మే 2: ప్రతీనెల సింగరేణి కార్మికుల వేతనాల నుంచి టాక్స్ పేరిట వేల రూపాయలు రికవరీ చేయడంతో ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారని సీఐటీయూ అధ్యక్షుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు అల్లి రాజేందర్ అన్నారు. గురువారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ దేశభద్రత కోసం పాటుపడుతున్న సింగరేణి కార్మికులు సైనికులతో సమానమని చెబుతున్న పాలకులు ఇన్‌కమ్‌టాక్స్ ఎందుకు రద్దు చేయడం లేదని మండిపడ్డారు. ప్రతినెల 80వేల వరకు వేతనాలు వస్తే అందులో సగానికి పైగా టాక్స్ పేరిట కట్ అవుతున్నాయని మండిపడ్డారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, మే 2: కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. నస్పూర్‌కాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం యూనియన్ సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయలోపంతో ఐదేళ్లుగా ఒక్క బొగ్గు గనిని కూడా ప్రారంభించలేదన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని, ఆదాయ పన్ను రద్దు కోసం పోరాడుతామని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్ రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్షణకు నిరంతరం పర్యవేక్షించాలి: జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్, మే 2: ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై ఆయన గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ఉద్యోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని బటర్‌మిల్క్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు.

2024-25ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీల పీవోలు ఎం శ్రీనివాస్, టి శ్రీనివాస్, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, డిప్యూటీ సీఎంవో రమేష్‌బాబు, అన్ని గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు, సంక్షేమాధికారులు, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: జీఎం

మందమర్రిటౌన్, మే 2: క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం సింగరేణి యాజమాన్యం సమ్మర్ క్రీడాక్యాంపులను నిర్వహిస్తుందని జీఎం మనోహర్ తెలిపారు. గురువారం సాయంత్రం సింగరేణి పాఠశాల మైదానంలో సమ్మర్ కోచింగ్‌కు హాజరై మాట్లాడారు. వేసవి సెలవులు ఉన్నందున విద్యార్థులు క్రీడాకారులు వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌లో కోచింగ్ తీసుకుని రాణించాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడాసామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారులు రమేష్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, క్రీడల సమన్వయకర్త రవి కుమార్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జీ తిరుపతి,పీఈటీలు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ రుణం మంజూరు చేయాలి

శ్రీరాంపూర్, మే 2: సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. గురువారం వారు ఆర్కే7 గనిని సందర్శించగా, కార్మికులు పలు సమస్యలు చెప్పుకున్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య పరిష్కరించాలని, మైసమ్మ షెడ్, అదనంగా సైకిల్ షెడ్లు నిర్మించాలని, నాణ్యమైన పనిముట్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఏరియా కార్యద ర్శులు ప్రసాదరెడ్డి, మారపల్లి సారయ్య, బుచ్చయ్య, పిట్‌కార్యదర్శులు రవీందర్,రాజయ్య, లచ్చయ్య, లక్ష్మణ్, నర్సింగారావు, సదానందం, నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.